క్లుప్తంగా

నేటి నుంచి గాలికుంటు వ్యాధి టీకాలు

అనపర్తి: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా బుధవారం నుంచి 31వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు ఉచితంగా వేయనున్నట్లు అనపర్తి ప్రాంతీయ పశువైద్యశాల పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోవడంతోపాటు పశువులు బలహీనపడతాయని తెలిపారు. వ్యాధి వచ్చిన తరువాత చికిత్స చేయడం కన్నా వ్యాధి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంపై పాడి రైతులు దృష్టి సారించాలని సూచించారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా అనపర్తి, బిక్కవోలు మండలాల్లో ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో రైతుల ఇంటి వద్దనే గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తారని తెలిపారు.

రోటరీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం


విద్యార్థికి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడ నుంచి వచ్చిన గుండె వ్యాధి నిపుణులు గజ్జెల ఓబుల్‌రెడ్డి 80 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ముగ్గురిని ఇతర పరీక్షలు నిమిత్తం కాకినాడ హాస్పిటల్‌కి తీసుకురమ్మని పేరెంట్స్‌కి తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రేపు క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గురువారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు గోకవరం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ వనజాకుమారి మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ శిబిరం జరుగుతుందన్నారు. 30ఏళ్లు దాటిన స్త్రీ, పురుషులు ఈ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, సిబ్బంది పవన్, రమణ పాల్గొన్నారు.

31 వరకు పశువులకు టీకాలు

బిక్కవోలు: జాతీయ పశువ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పశువులకు టీకాలు వేస్తామని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన బిక్కవోలులో మాట్లాడుతూ మార్చి1 నుంచి 31వ తేదీ వరకు అనపర్తి, బిక్కవోలు మండలాల్లోని పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు రైతులకు ఇంటి వద్దనే వేస్తామన్నారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సహాయం


బాలుడి కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న కార్యదర్శి శ్రీనివాసరావు

గోకవరం: అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడి వైద్యానికి గోకవరం వలంటీర్లు తమ వంతు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన పాట్నూరి సతీష్ కుమారుడు రెండున్నరేళ్ల సత్యశ్రీఅక్షయ్‌రామ్ సీజీడీ అనే అరుదైన వ్యాధి బారిన పడ్డాడు. చికిత్సకు సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని తన కుమారుడి వైద్యానికి సహకరించాలని బాలుడి తండ్రి సోషల్ మీడియా వేదికగా సహాయం కోరాడు. అది చూసిన గోకవరంలో వలంటీర్లు రూ.5,500 నగదును బాలుడి వైద్య ఖర్చుల కోసం సమకూర్చారు. ఈ మొత్తాన్ని మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. బాలుడి వైద్యానికి సహకారం అందించిన వలంటీర్లను పలువురు అభినందించారు.

850 మందికి మధుమేహ నిర్ధారణ పరీక్షలు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో 3,000 మందికి మధుమేహ ఉచిత నిర్ధారణ వైద్య పరీక్షలు చేయాలనేదే లక్ష్యంగా ఇంటింటికి తిరిగి పరీక్షలు చేస్తున్నామని స్థానిక లయన్స్ క్లబ్ సీనియర్ ప్రతినిధి మండ రాజారెడ్డి అన్నారు. జి.మామిడాడలో మంగళవారం ఇంటింటికి మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రస్తుతం 850 మందికి మధుమేహ నిర్ధారణ పరీక్షలు పూర్తి చేశారన్నారు. మిగిలిన వారికి త్వరలో పూర్తి చేస్తారన్నారు. క్లబ్ ప్రతినిధులు అచ్చిబాబు చౌదరి, పప్పు రామకృష్ణారెడ్డి, భాస్కరరెడ్డి, రాయుడు వీర్రాఘవులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

రాజానగరం: మండలంలోని మదర్ థెరిస్సా టైలర్స్ యూనియన్ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి, విలియమ్స్‌హో చిత్రపటానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. సంఘం అధ్యక్షుడు గూడాల గన్నిరాజు, కార్యదర్శి మండ శ్రీను పాల్గొన్నారు.

కనుల వైభవం.. నరసన్న కల్యాణం

- 2 నుంచి 8వ తేదీ వరకు ఉత్సవాలు
- చురుగ్గా జరుగుతున్న ఏర్పాట్లు


కోరుకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం


కొండపైన ఆలయానికి వెళ్లే మెట్లకు వేసిన రంగులు

మధురపూడి: కోరుకొండలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్నవరం వీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 8వ తేదీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా తొలిరోజు గురువారం స్థానిక దేవుని కోనేరు వద్ద పుట్టమన్ను సేకరణ, అంకురార్పణం, ధ్వజారోహణం, గ్రామ బలిహరణ, సేవాకాలం జరుగుతోంది.

3న రథోత్సవం, రాత్రి కల్యాణం

మార్చి 3వ తేదీ (శుక్రవారం) ఉదయం స్వామివారి ఆలయ తలుపులు తెరచి, ఆరాధన చేసి, సర్వ దర్శనానికి అనుమతి ఇస్తారు. స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెగా అలంకరించి, మధ్యాహ్నం 1.56 గంటలకు పల్లకీపై తోడ్కొని, రథంపై ఆశీనులు చేస్తారు. కోరుకొండలోని ప్రధాన వీధుల్లో రథోత్సవం వైభవంగా జరుగుతుంది. అనంతరం లక్ష్మీదేవి, స్వామివార్లకు మంగళ స్నానాలు నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణ మండపంలో వైఖానస ఆగమ, వైష్ణవ సాంప్రదాయంగా కల్యాణం జరుగుతుంది. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్‌పీ రంగరాజ బట్టర్, వేద పండితులు పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో కల్యాణం జరుగుతోంది.

సాంస్కృతిక కార్యక్రమాలు

4 నుంచి 8వ తేదీ వరకూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఆరాధన, సర్వదర్శనం, గ్రామ బలిహరణ, సేవాకాలం, తీర్థ ప్రసాదాల గోష్టి నిర్వహించబడతాయి. సాయంత్రం వేళల్లో జరిగే గ్రామోత్సవాల్లో స్వామివారు గరుడ, ఆంజనేయ, గజ, శేష వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి వేళల్లో స్వామివారి కల్యాణ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. 7న చక్రస్నానం, 8న శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు. రెడ్డి పంతులు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సత్రంలో ఉత్సవాల ముగింపు వరకూ మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజన సదుపాయం కల్పిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈఓ పాటి సత్యనారాయణ పర్యవేక్షిస్తారు.

తీర్థానికి ఏర్పాట్లు పూర్తి



కోరుకొండ తీర్థానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తులకు తాగునీరు తదితర అన్ని వసతులు కల్పిస్తున్నాం. దేవదాయశాఖకు చెందిన వందల మంది ఉద్యోగులు, సిబ్బందితో పాటు, అన్నవరం దేవస్థానం సెక్యూరిటీని ఏర్పాటు చేశాం. కొండపైన, కింద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. మార్చి 3న రథోత్సవాన్ని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రారంభిస్తారు.

– డీఎల్‌వీ రమేష్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్, అన్నవరం దేవస్థానం

వైభవంగా ఉత్సవాలు



కోరుకొండ తీర్థం వైభవంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నాం. డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, సీఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల ఆధ్వర్యంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పారిశుధ్య చర్యల్లో భాగంగా రాజమహేంద్రవరం నగర పాలకసంస్థ, పంచాయతీరాజ్ శాఖకు చెందిన కార్మికులను తీసుకువస్తున్నాం. భక్తులకు అన్నిరకాల వసతులు కల్పించాం.

– తాడి రజనీరెడ్డి, అన్నవరం దేవస్థానం ట్రస్టు సభ్యులు

అభివృద్ధి పనులకు సహకరించాలి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- మంత్రి, ఉన్నతాధికారులకు వినతి

రాజానగరం: సీతానగరం మండలం రఘుదేవపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి గతంలో మంజూరు చేసిన రూ.35 లక్షలతో పనులు పూర్తి కావడం లేదని, ఆ నిధులను రూ.54 లక్షలకు పెంచి, ఆలయ అభివృద్ధి పూర్తిస్థాయిలో జరిగేలా సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు విజ్ఞప్తి చేశారు. అమరావతిలో కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) కమిటీ సమావేశం జరగనున్న నేపథ్యంలో ముందుగానే మంత్రిని కలుసుకున్న ఆయన ఈ మేరకు తన విన్నవించారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాల నేపథ్యంలో ఉత్సవ కమిటీ నియామకానికి, కోరుకొండలోని రెడ్డి పంతులు సత్రం ధర్మకర్తల మండలి ఏర్పాటుకు చేసిన విజ్ఞాపనలపై కూడా మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే రాజా తెలిపారు. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాసి నిర్ణయం తీసుకుంటామన్నారన్నారు.

జలవనరుల పనులకు జీఓ విడుదల చేయాలి

నియోజకవర్గంలోని సాగునీటి అవసరాలకు సంబంధించి ఆర్థిక శాఖ అనుమతి పొందిన 53 జలవనరుల పనులను పూర్తి చేసేలా జీఓ విడుదల చేయాలని ఆ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్‌కు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విజ్ఞప్తి చేశారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం కోసం భూములు కోల్పోయిన రైతాంగానికి పెండింగ్‌లో ఉన్న పరిహారం పెంచే విషయాన్ని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ధవళేశ్వరంలో ఖాళీగా ఉన్న గోదావరి ఈస్టర్న్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయాన్ని బొమ్మల మ్యూజియం ఏర్పాటుకు, పక్కనే ఉన్న జేఈస్ భవనాన్ని బాలల ఆత్మీయ గృహం ఏర్పాటుకు నామమాత్రపు అద్దెపై కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పొట్టిలంకలో గోదావరి ఈస్టర్న్ బ్యాంక్ కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణానికి గతంలో రూ.3.73 కోట్లు మంజూరు చేశారని, అయితే మరో రూ.1.27 కోట్లు అదనంగా మంజూరు చేయాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపాల్ సెక్రటరీకి విన్నవించారు. వీటితో పాటు కోరుకొండ మండలం గాదరాడ, కణుపూరు మధ్య భూములను సాగులోకి తీసుకువచ్చేలా నరసాపురం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అనుమతి నివ్వాలన్నారు.


మంత్రి కొట్టు సత్యనారాయణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

వాటర్ గ్రిడ్ పథకం అమలుకు..

రాజానగరం నియోజకవర్గంలో పైపులైన్ల ద్వారా ఇంటింటికీ గోదావరి జలాలను తాగునీరుగా అందించేలా ఉద్దేశించిన వాటర్ గ్రిడ్ పథకానికి సాధ్యమైనంత త్వరగా అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్‌కు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విజ్ఞప్తి చేశారు. రూ. 219 కోట్ల వ్యయంతో కూడిన ఈ పథకం ద్వారా గోదావరి జలాలను గ్రామాలలోని అన్ని చెరువులకు తరలిస్తారన్నారు. అక్కడ నుంచి శుద్ధి చేసిన నీటిని కుళాయిల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తారని వివరించారు.

సీహెచ్‌సీగా అభివృద్ధి చేయాలి

సీతానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల సామర్థ్యంతో కూడిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు త్వరితగతిన తీసుకోవాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ వినోద్‌ను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు. ఇదే సమయంలో పీహెచ్‌సీలో అవసరమైన వైద్య సిబ్బందికి నియామకానికి సంబంధించి కూడా చర్చించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దానరి శ్రీరంగ


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి

గోకవరం: గ్రామాల్లో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ శ్రీవల్లి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు శాఖాపరంగా ప్రగతిని వివరించారు. దీనిలో భాగంగా రంపయర్రంపాలెం గ్రామంలో ఇళ్ల పట్టాలు సిద్ధమై నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు ఇంకా ఎందుకు పంపిణీ చేయలేదని సభ్యులు గృహ నిర్మాణ శాఖ అధికారులను నిలదీశారు. ఓటీఎస్ చేయించుకుని సొమ్ములు చెల్లించిన వారికి రిజిస్ట్రేషన్ పత్రాలు ఇవ్వలేదని, ఇలా అయితే లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. మండలంలో మామిడి, జీడిమామిడి సాగు అధికంగా ఉన్నప్పటికీ హార్టికల్చర్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండటంలేదన్నారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, తంటికొండ, రంపయర్రంపాలెం వెళ్లే మార్గంలో రహదారులు పునరుద్ధరించాలని సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలపై అధికారులు దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ కెవిఎస్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మంచుపరదా


ముగ్గళ్ల గ్రామంలో మంచుదుప్పటి

సీతానగరం: తెల్లవారుజామున మంచు, మధ్యాహ్నం దంచుతున్న ఎండతో వాతావరణం విచిత్రంగా మారింది. ముగ్గళ్లలో మంగళవారం ఉదయం 7.30 గంటలకు కూడా దట్టమైన పొగమంచు కమ్ముకుని ఉంది. మంచు పరదాల మాటున పరిసరాలు ఆహ్లాదకరంగా కనిపించాయి.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


నన్నయలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం


సీతానగరం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబాబు


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రాజానగరం: ప్రపంచంలోని వివిధ దేశాలతో భారతదేశం విజ్ఞాన శాస్త్రంలో గట్టి పోటీనిస్తోందని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి.జానకిరామ్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. నన్నయ విగ్రహానికి, సీవీ రామన్ చిత్రపటానికి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజుతో కలసి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమణేశ్వరి అధ్యక్షతన డాక్టర్ కె.దీప్తి కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో జాతీయ సైన్స్‌డే వేడుకలు జరిగాయి. చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొన్న వై.మహీంద్ర, హర్షిత్‌కుమార్‌ను సన్మానించారు. ప్రిన్సిపాల్ ఏఎస్ఎన్ మూర్తి మాట్లాడారు. గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

మధురపూడి: కోరుకొండలోని సృజన ఇంగ్లీషు మీడియం స్కూల్లో చైర్మన్ వీవీవీఎస్ఎన్ మూర్తి పర్యవేక్షణలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. షిర్డీసాయి స్కూల్లో మేనేజ్‌మెంట్ గరగ లక్ష్మీ పద్మావతి, సత్యం శ్యామలా శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది.

సీతానగరంలో..

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ హైస్కూల్లో మంగళవారం సైన్స్ దినోత్సవం ఘనంగా జరిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) నుంచి రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీవరం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హైడ్రాలిక్ బ్రిడ్జి నమూనాకు రూపకల్పన చేసిన మొదటి సంవత్సరం విద్యార్థులు కె.జెఫీ, సీహెచ్ హేమ సత్యసాయి అందరి ప్రశంసలు పొందారు.

= సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో క్విజ్, రంగోలి సైన్స్ పోటీలు నిర్వహించారు. హెచ్ఎం పుష్పలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సైన్స్ సమన్వయకర్త కన్నూరి సతీష్‌బాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా..

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు ఉన్నత పాఠశాలలో సైన్సు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను పేరెంట్స్ కమిటీ చైర్మన్ సూరిబాబు ప్రారంభించారు. బాల బాలికలు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఒ.సాయి చక్రీశ్వర్, మణికంఠ తయారు చేసిన హైడ్రాలిక్ క్రేన్ ప్రథమ బహుమతి, చల్లా శ్రీజనిధి తయారు చేసిన పగలు, రాత్రి ఏర్పడే విధానానికి ద్వితీయ బహుమతి, శ్రీలం శ్రీనివాసు, వెంకటరెడ్డి తయారు చేసిన వాటర్ అలారానికి తృతీయ బహుమతి వచ్చినట్లు పాఠశాల హెచ్ఎం బీవీ ఎల్ఎస్ మూర్తి తెలిపారు.

మానవాళి అభివృద్ధికి సైన్స్ మూలం

అనపర్తి: స్థానిక తేతలి రామిరెడ్డి మంగాయమ్మ కళా వేదిక ప్రాంగణంలో ఐటీసీ ప్రథమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్ లెవెల్ డిజిటల్ మేళాలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో ముందుగా సీవీ రామన్ చిత్ర పటానికి పాఠశాల హెచ్ఎం నల్లమిల్లి సత్తిరెడ్డి పుష్పాంజలి ఘటించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

రంగంపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముందుగా ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి డాక్టర్ సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించి విద్యార్థులు ప్రదర్శించిన ఆవిష్కరణలను తిలకించారు. పర్యావరణం, కాలుష్యం, జీవశాస్త్రం, రోడ్డు భద్రత, తదితర 10 అంశాల్లో దాదాపు 200 మంది విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


రంపయర్రంపాలెంలో..

గోకవరం: రంపయర్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు గంధం ప్రమీలరాణి ఆధ్వర్యంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు హరిబాబు, రమేష్, ఆంజనేయులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ తీర్థం ఏర్పాట్ల పరిశీలన

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు 2 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను అన్నవరం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డీఎల్‌వీ రమేష్ బాబు, ట్రస్టు సభ్యులు తాడి రజనీరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొందాడ చందు, అన్నవరం దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

నన్నయలో ఎంప్లాయిబిలిటీ స్కిల్ ప్రోగ్రామ్


బ్రోచర్‌ని విడుదల చేస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నాంది ఫౌండేషన్ సహకారంతో ఐదు రోజుల పాటు జరిగే ఎంప్లాయిబిలిటీ స్కిల్ ప్రోగ్రామ్‌ను ఇన్‌చార్జి వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ని విడుదల చేశారు. పీజీ, బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు లైఫ్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రెజెంటేషన్ స్కిల్స్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై మార్చి 4 వరకు శిక్షణ ఇస్తారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు, ఇంటర్వ్యూలను సమర్థవంతంగా ఎదుర్కొని, కంపెనీలలో ఆసక్తి ఉన్న ఉద్యోగాలను పొందేందుకు ఈ శిక్షణ తోడ్పడుతుందన్నారు. ఈ శిక్షణకు 450 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వసతి గృహానికి వాసవీక్లబ్ వితరణ

సీటీఆర్ఐ: స్థానిక గణేష్ చౌక్‌లోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినుల సౌకర్యార్థం వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ (రాజమండ్రి) సీలింగ్ ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అందజేసింది. వసతి గృహంలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు లేవని వార్డెన్ సత్యకుమారి వాసవీ క్లబ్‌కు విన్నవించగా జెడ్‌సీ బ్రహ్మ గిరీష్ చేతుల మీదుగా వాటిని మంగళవారం పంపిణీ చేశారు. అలాగే ఐదుగురు పేద ఆర్యవైశ్య విద్యార్థులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ బచ్చు వెంకట సూర్యనారాయణమూర్తి, సెక్రటరీ బత్తుల శ్రీరాములు, ట్రెజరర్ పింజెర్ల నరసింహగుప్తా, ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు స్వర్ణాంధ్ర సంస్థ కృషి

రాజమహేంద్రవరం సిటీ: మహిళా సాధికారత, అభ్యున్నతికి స్వర్ణాంధ్ర సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని లయన్స్ 316బీ జిల్లా గవర్నర్ మాటూరి మంగతాయారు అన్నారు. ఆ సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాంగణంలో మంగళవారం జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 ఏళ్లుగా నిరాశ్రయులకు సేవలందించడం, మహిళలను ప్రోత్సహించడం స్వర్ణాంధ్ర సంస్థ పనితీరుకు అద్దం పడుతోందన్నారు. ఈ సందర్భంగా వివిధ కోర్సుల్లో ప్రథమ, ద్వితీయ శ్రేణి సాధించిన మహిళలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర నిర్వాహకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు, మార్కెటింగ్ నిపుణురాలు తమ్మన సూర్యకుమారి పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు తోడ్పాటు

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలో పారిశుధ్యం మెరుగుకు తోడ్పాటు అందిస్తామని జన్ సాహస్, సేఫ్‌వే జాతీయ సంస్థలు ముందుకు వచ్చాయి. ఈ మేరకు తాము అందించే సహకారంపై మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్లు, పంచాయతీ పాలకవర్గానికి అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. పంచాయతీ పరిధిలోని కడియపులంక, బుర్రిలంక, వెంకాయమ్మపేట గ్రామాల పరిధిలో అరవైచోట్ల చెత్త అధికంగా పోగవుతున్నట్లు తమ బృందం గుర్తించిందని జన్ సాహస్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ పట్నాయక్ తెలిపారు. అక్కడ కుండీలను ఏర్పాటు చేసి, ప్రజలంతా చెత్తను వాటిలో వేసే విధంగా చైతన్యపరచాల్సి ఉంటుందన్నారు. స్థానిక నాయకులు మార్గాని ఏడుకొండలు మాట్లాడుతూ ఇరుకువీధుల్లోకి వెళ్లి చెత్తను సేకరించే విధంగా మినీ ట్రాక్టర్‌ను సమకూర్చాలని ఆ సంస్థ ప్రతినిధులను కోరారు. సమావేశంలో ఉపసర్పంచ్ పాటంశెట్టి రాంజీ, పంచాయతీ కార్యదర్శి విజయరాజు, రిసోర్స్ పర్సన్ చిట్టి శంకర్, వెల్ఫేర్ సెక్రటరీ రమేష్, సంస్థ ప్రతినిధులు అందుకూరి తేజ, వలంటీర్లు పాల్గొన్నారు.

మార్చి 5న బ్రాహ్మణ మహిళా సదస్సు

సీటీఆర్ఐ: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ఆధ్వర్యంలో మార్చి 5న రాజమహేంద్రవరం శివారు కాతేరు వద్ద ఉన్న వెంకటాద్రి గార్డెన్స్‌లో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ మహిళా సదస్సు నిర్వహిస్తున్నట్టు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 23 లక్షల మంది సమాఖ్య బలం ఉన్నప్పటికీ ఏరాజకీయ పార్టీ తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. ముఖ్యఅతిథిగా శ్రీశక్తి పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి మాతాజీ రమ్యానంద భారతి పాల్గొని అభిభాషణ చేస్తారన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ రాష్ట్ర సదస్సులో తెలంగాణ శాసన మండలి సభ్యురాలు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె వాణీదేవి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ పాల్గొంటారన్నారు.